విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 01 జూన్ 2025 8 పేజీలు

బీజేపీ విభజన రాజకీయాలను తిప్పికొట్టండి

- సీపీఐ వందేళ్ళ ఘన చరిత్రను ప్రజలకు వివరించండి
- సీపీఐ జట్ల శాఖ బహిరంగ సభలో అక్కినేని వనజ

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : దేశంలో ప్రస్తుత రాజకీయాలు చాలా క్లిష్టంగా ఉన్నాయని, ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయని, కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య విభజన రాజకీయాలకు పాల్పడుతున్నదని ఈ వ్యూహాలను పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ స్టేడియం వద్ద జట్ల సంఘం సీపీఐ శాఖ మహాసభ సంఘం అధ్యక్షులు కుండ్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపి వలన దేశ ప్రాదేశిక సమగ్రతకు తీవ్రమైన ముప్పు కలుగుతుందన్నారు. ప్రజాస్వామ్యం, శాంతి, సామాజిక న్యాయాన్ని కాపాడుకోవలసిన అవసరం నేటి ప్రజానీకానికి ఉందని అన్నారు. సీపీఐ శతవసంతాల కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతున్నదని, వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమంలో ఎర్రజెండా దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం, రైతులు, కార్మిక వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేసిందని పేర్కొన్నారు. భూ పోరాటం ద్వారా లక్షలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేసిన ఘనత సీపీఐకు

▶మిగతా 2లో..

పరిశ్రమలకు రాయితీలు

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహక రాయితీల క్రింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 36 యూనిట్లకు సుమారుగా రూ.1 కోటి 28 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదించిందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. శనివారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశం కలెక్టర్ షణ్మోహన్ కాకినాడ తన క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. సింగల్ డెస్క్ విధానం క్రింద గడచిన త్రైమాసిక కాలంలో అందిన దరఖాస్తుల పరిష్కారం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహకానికి వివిధ రాయితీల మంజూరు, క్లస్టర్ డెవలప్మెంట్ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్.. పరిశ్రమలు, ఫ్యాక్టర్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, గ్రౌండ్ వాటర్, సాంఘిక సంక్షేమం, అగ్నిమాపక, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులతో

▶మిగతా 2లో..

కరోనా కలకలం

- చాప కింద నీరులా పెరుగుతున్న కోవిడ్ కేసులు
- ఏలూరు కలెక్టరేట్లో 5 కోవిడ్ కేసులు
- జిల్లాలో కేసులు నమోదవ్వలేదంటున్న డిఎంహెచ్ఓ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : గత మూడు సంవత్సరాలుగా ఎటువంటి భయాందోళన లేకుండా స్వేచ్ఛగా తిరుగుతున్న ప్రజలకు మరో మారు కరోనా భయం పుట్టుకొస్తుంది. కోవిడ్ కేసులు చాప కింద నీరులా పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతుంటే వైద్య ఆరోగ్యశాఖ మాత్రం పాజిటివ్ కేసులు నమోదు అవ్వలేదని చేతులు దులిపేసుకుంటున్నది. కరోనా సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదని ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా రోజురోజుకు పాజిటివ్ కేసులు పెరుగుతున్న తరుణంలో ఏలూరు జిల్లాలో కరోనా వస్తే తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి వైద్య ఆరోగ్య శాఖ ఎటువంటి అవగాహన కార్యక్రమాలు గాని, ఇంటింటా ప్రచారం గానీ నిర్వహించకపోవడం గమనార్హం. జిల్లాలో కోవిడ్ కేసులు నమోదవుతున్నప్పటికీ వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలలో చూపడం లేదనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. గత మూడు రోజుల క్రితం ఏలూరు నగరంలోని శాంతినగర్ ప్రాంతానికి చెందిన ఇరువురు దంపతులకు కరోనా పాజిటివ్ వచ్చిందని విషయం మరవకుండానే శనివారం తాజాగా మరో కోవిడ్ వార్త చెక్కర్లు కొట్టింది. జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలోని కలెక్టరేట్లో పనిచేస్తున్న పిజిఆర్ఎస్ సిబ్బందిలో ఐదుగురికి కోవిడ్ పాజిటివ్

▶మిగతా 2లో..

20 సూత్రాల అమలు కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

కమిటీ చైర్మన్ దినకర్

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర -2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యసాధన దిశగా 20 సూత్రాల కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని 20 సూత్రాల పార్ములా కమిటీ చైర్మన్ లంకా దినకర్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో 20 సూత్రాల కార్యక్రమాల అమలుపై వివిధ శాఖల జిల్లా అధికారులతో చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ ప్రస్తుత అమలు తీరు పైన , ప్రతి గ్రామ పరిధిలోని ప్రతి గృహానికి సురక్షిత త్రాగు నీరు ఇచ్చే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జల్‌జీవన్ మిషన్ అమలు తీరు, గ్రామీణ సడక్ యోజన, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, పీఎం సూర్యఘర్, కుసుమ్, పీఎం ఆవాస యోజన, పీఎం విశ్వకర్మ యోజన, పీఎం స్వనిధి వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతో పాటు, ద్వారక తిరుమల, కొల్లేరు పర్యాటక రంగం, మత్స్య సంపద అభివృద్ధి తదితర అంశాల పైన సమీక్షించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, సీపీవో వాసు దేవరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి శ్రామికుల సరాసరి కూలీ రూ.307 రూపాయలు పెంచిందని, జిల్లాలో ప్రస్తుతం సగటున రూ.290 వరకు ఉందని, దినసరి సరాసరి రేటును పెంచేందుకు సరైన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గత 5 సంవత్సరాలలో 7364 కోట్ల రూపాయల సబ్సిడీతో 18.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందించి నట్టు తెలిపారు. గత ఆర్థిక సంవత్స రంలో ఉపాధి హామీ 120 లక్షల పనిదినాలు లక్ష్యానికిగాను 123.69 లక్షల పనిదినాలు కల్పించి నట్టు తెలిపారు. లక్ష్యానికి మించి వేతనాల కోసం 312.29 కోట్లు రూపాయలు చెల్లించారన్నారు. గత 5 సంవత్సరాలు ఉపాధి హామీ మెటీరియల్ మరియు లేబర్ కాంపోనెంట్ బడ్జెట్ మరియు వాస్తవంగా చేసిన ఖర్చు చేసిన వివరాలను అందించవలసిందిగా కోరారు. అర్హత కలిగిన కుటుంబానికి నిర్దేశిత 100 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ విజయరాజు, వ్యవసాయ శాఖాధికారి హబీబ్ భాషా, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఈ లు రమణమూర్తి, త్రినాధ్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీలో కోవర్టులున్నారా?

- అధినేత నోట మాట..శ్రేణుల్లో విస్మయం
- కోవర్టులు ఉంటే ఎందుకు ఉదాసీనం

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: తెలుగుదేశం పార్టీలో కోవర్టులు ఉన్నారా? ఇది నిజమా? ఎవరా కోవర్టులు? కోవర్టులే ఉంటే పార్టీ అధినేతలు ఎందుకు ఉదాసీనంగా ఉన్నారు? ఈ మాట సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నోటి నుండే వచ్చింది..మరి కోవర్టులు ఉంటే పార్టీ ఉనికికే ప్రమాదం కదా? ఆ కోవర్టులు పార్టీలో ఉంటే బలమైన వారా? బలహీనులా? కోవర్టులు ఉన్నారని పార్టీ అధినేతకే తెలిసినప్పుడు వాళ్లను ఎందుకు బయటకు పంపడం లేదు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు తెదేపా నుంచి రావాల్సి ఉంది. పార్టీలో కోవర్టులున్నారనే మాట ఆషామాషీ కాదు..ఈ కోవర్టులు ఎవరో అధిష్టానం గుర్తించిందా? హెచ్చరిస్తే ఏదోలా బయటికి పోతారని భావించిందా? ఈ ప్రశ్నలు అన్నింటిని తరచి తరచి విశ్లేషించి లోతైన అధ్యయనం చేయకపోతే తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ కోవర్టులు ముదిరి వచ్చే ఎన్నికల నాటికి చాపకింద నీరులా విస్తరించి పార్టీ ఉనికికి ప్రమాదకారులుగా మారతారని గుర్తించాల్సిన అవసరం ఉంది. బాబు వ్యాఖ్యలను తెదేపా శ్రేణులు బలంగా నమ్ముతున్నాయి కూడా. ఇటీవల కొన్ని ప్రాంతాల నుండి పార్టీలో చేరిన వైకాపా నాయకులే కోవర్టులనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెదేపాలో స్థానిక నేతలు ఈ విషయాన్ని చెప్పినా అధిష్టానం మౌనంగా ఉండి వైకాపా నేతలను తెదేపాలోకి చేర్చుకుంటే,వైకాపా అధినేత జగన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయవచ్చు అనే భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. జగన్ కరుడుగట్టిన నేత. ఆయన ఆత్మస్థైర్యం దెబ్బతినదనే విషయాన్ని తెదేపా నేతలు గ్రహించాలి. కోవర్టులు ఉన్నారని భావిస్తే వారిని గుర్తించి ఇప్పుడే సాగనంపితే తెదేపాకు ఎంతో శ్రేయస్కారంగా ఉంటుంది. కోవర్టులు ఉన్నారని మహానాడు వేదిక సాక్షిగా ప్రస్తావించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వాళ్లను ఎందుకు గుర్తించలేకపోతున్నారు..? అనే ప్రశ్న అందరిలోనూ ఉదయిస్తుంది.

కార్యకర్తలకు కొదవ లేదు..
అయినా వలసలు ఎందుకు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేకమంది వైకాపా కార్పొరేటర్, కౌన్సిలర్ లు, ఎంపీటీసీ, సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీలతోపాటు, నాయకులను తెదేపాలోకి చేర్చుకున్నారు. కొంతమంది తెదేపా స్థానిక నేతలను కాదని వైకాపా నుంచి వచ్చిన వారికి చిన్న పదవులను కూడా పందేరం చేశారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. 2014 ఎన్నికలలో అధికారంలో ఉన్న టీడీపీ నేతలను కాదని

▶మిగతా 2లో..

నేటి నుంచి నూతన విధానంతో రేషన్ సరుకుల పంపిణీ

విశాలాంధ్ర-ముదినేపల్లి : ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరానికి గత ప్రభుత్వ విధానంలో ఉన్న రేషన్ సరఫరాకు స్వస్తి పలికి నూతన విధానంలో రేషన్ సరుకుల పంపిణీకి సర్వం సిద్ధం అయ్యింది. ముదినేపల్లి మండలంలో మొత్తం 39 రేషన్ షాపులు ఉన్నాయి. 19 వేల 656 మంది రేషన్ కార్డు లబ్ధిదారులున్నారు. నేటి నుండి ఉదయం 8 గంటలకు రేషన్ షాపులు తెరవబడి ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు పనిచేస్తాయని , 65 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటి వద్దకు రేషన్ సరఫరా జరుగుతుందని తహసీల్దార్ పవన్ కుమార్ తెలిపారు. బియ్యం, పంచదార మాత్రమే సరఫరా జరుగుతుందని , సుమారు 900 మంది వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరఫరా జరుగుతుందని తహసీల్దార్ వివరించారు.

కోవర్టులున్నారా ? (1వ పేజీ తరువాయి)

వైకాపా నుంచి వచ్చిన ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకుని మంత్రి పదవులు కూడా ఇచ్చి చేతులు కాల్చుకొని 2019 ఎన్నికలలో బోల్తా కొట్టిన విషయాన్ని కూడా గుర్తిస్తే మంచిదని కొంత మంది సీనియర్ నేతలు సూచిస్తున్నారు.

మహానాడు వేదికగా చంద్రబాబు వ్యాఖ్యలు

టీడీపీలో కోవర్టులు ఉన్నారని మహానాడు వేదికగా అధినేత చంద్రబాబు కుండబద్దలు కొట్టారు. ఆయన వ్యాఖ్యలను చూస్తే నిజమే అనిపిస్తుంది. నాయకులు వస్తుంటారు.. పోతుంటారు.. కార్యకర్తలు ఎప్పటికీ శాశ్వతం అని కూడా బాబు అన్నారు. ఈ వ్యాఖ్యలు చేసినప్పుడు వేదికపై చాలామంది ముఖాలలో మార్పు కనిపించింది. 2014 నుంచి 2024 దాకా ఇంకా చెప్పాలంటే నేటి వరకు వైసీపీకి ఎరవేసి అనేకమంది నాయకులను తెలుగుదేశం పార్టీ చేర్చుకుంటుంది. అలా వచ్చినవారికి పదవులు కూడా కట్టబెడు తోంది. 2014 నుంచి 2019 వరకు మధ్యలో చూస్తే ఏకంగా 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకున్నారు. వారిలో ఏకంగా నలుగురికి మంత్రి పదవులు ఇచ్చారు.ఇతరులకు కీలకమైన బాధ్యతలు హోదాలు ఇచ్చారు.మరి ఆ వలస పక్షుల వల్ల పార్టీ బాగుపడలేదు. 2019లో పరాజయం పాలయ్యింది. అందులో కూడా కొంతమంది కోవర్టులు ఉండే ఉంటారని అంటున్నారు. ప్రస్తుతం పరిశీలిస్తే 2024 నుంచి నేటి వరకు చాలామంది వైసీపీ నేతలు టీడీపీలో చేరారు.వారిలో కొందరు మంత్రులు అయ్యారు. మరికొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యారు. వారంతా అధికార రాజముద్ర తోనే ఉంటున్నారు. మరి వలస పక్షులు వస్తారు.. పోతారు..అని ఎంతో అనుభవం కలిగిన చంద్రబాబు ప్రకటన చేసినప్పుడు అలాంటి వారిని ఎందుకు చేర్చుకోవడం అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది.టిడిపిలో నాయకుల కొరత ఏమీ లేదు.ఇలా వచ్చిన వారికి పదవులు ఇవ్వడం ద్వారా తొలి నుండి పార్టీలో ఉన్న వారికి అన్యాయం జరుగుతుంది కదా అన్న చర్చ ఇటీవల కాలంలో ఎక్కువైంది.అయినా కండువాలు కప్పే కార్యక్రమం ఆగదు..అది ఆగకపోతే పక్కా రాజకీయం అయితే అందులో వ్యూహం ఉంటే దానిమీద విమర్శలు చేసుకోవడం కూడా వ్యర్థమే అంటున్నారు. అంతేకాకుండా కోవర్టులు అన్ని పార్టీలలోనూ ఉంటారని అంటు న్నారు. దీంతో పాటుగా పార్టీలో అవకాశాలు దక్కని వారు కూడా వేరే పార్టీలలో బెర్తులు పదిలం చేసుకోవడానికి ఈ పార్టీలోని అంతర్గత సమాచారం వేరే పార్టీలోకి చేరవేసే అవకాశాలు లేకపోలేదు అంటున్నారు. కార్యకర్తలే శాశ్వతం అన్నప్పుడు వలస పక్షులకు అడ్డుకట్ట వేయాలి.అధికారంలో ఉన్న పార్టీలో ఐదేళ్ళ అన్నీ అనుభవించి చివరి నిమిషంలో పార్టీలో చేరితే వారిని ఆదరించి పదవులు కట్టబెట్టడం వల్ల క్యాడర్ నిజంగా నలిగిపోతుంది. వారి కింద పని చేయడానికి కేడర్ మనసు చంపుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.

కార్యకర్త అధినేత అనేది స్లోగన్‌గా మారకూడదు

కార్యకర్తే అధినేత అన్న స్లోగన్ టీడీపీ ఈ మహానాడులో ఇచ్చింది.దానిని నినాదంగా పరిమితం చేయకుండా ఉండాలంటే ఇతర పార్టీల నేతలను చేర్చుకోకుండా ఉండటమే బెస్ట్ అని కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు. దానివల్ల కోవర్టుల బెడద కూడా తగ్గుతుందంటున్నారు. నాయకుడు పార్టీ మారినా క్యాడర్ మారదు.పైగా ఆ వైపు నుంచి ఈ వైపునకు ఎవరైనా వచ్చినా వారితో కలిసి పనిచేయడానికి కూడా కార్యకర్తలు ఇష్టపడరు. ఇది కేవలం టిడిపికే కాదు అన్ని పార్టీలకు వర్తించే సూత్రం. టిడిపి అధినేత చంద్రబాబు కోవర్టులు ఉన్నారని అంటున్నారు.. కాబట్టి ఇతర పార్టీలకు టిడిపి తలుపులు మూసి వేయడం మేలు అనే సూచనలు కూడా వినపడుతున్నాయి. ఏమైనా టిడిపి కోవర్టుల పట్ల అప్రమత్తంగా ఉంటే సరి..లేదంటే చరిత్ర పునరావృతం అవుతుంది అనడంలో సందేహం లేదు.

పీఎంపీల ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - గణపవరం: పి.ఎం.పి అసోసియేషన్ పశ్చిమగోదావరి జిల్లా, గణపవరం మండలం, సబ్ సెంటర్ కాశిపాడు వారిచే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ అవగాహన ర్యాలీని కాశిపాడు గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఎంపి అసోసియేషన్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ఏఆర్ కే పరమేశ్వర్లు మాట్లాడుతూ పొగాకు మరియు నికోటిన్ ఉత్పత్తులపై పరిశ్రమ వ్యూహాలను బహిర్గతం చేయడం జరిగిందని అన్నారు. పొగాకులో ఉండే రసాయనాల వలన మెదడు, గుండె, ఊపిరితిత్తులకు రక్త ప్రసరణ తగ్గుతుందన్నారు. గుట్కా, కైని పొగాకు నములుటవలన నోటి మరియు శ్వాసకోశ క్యాన్సర్లకు దారి తీయవచ్చునని అన్నారు.ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ ఏ రమ్యశ్రీ,ఏ ఎన్ ఎం.శివకుమారి, పిఎంపి సభ్యులు ఎం శ్రీనివాసు,ఆశా వర్కర్లు సిహెచ్ కృష్ణవేణి ,టి వరలక్ష్మి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కలకలం (1వ పేజీ తరువాయి)

వచ్చిందని ప్రచారం జోరుగానే సాగింది. ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా ఉన్నతాధి కారులు వారిని హెూం ఐసోలేషన్ లో ఉండమని సూచించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించక పోయినప్పటికీ ప్రసార మాధ్యమాల్లో, సోషల్ మీడియాలో హల్చల్ చేసింది. ఇదే విష యాన్ని పరోక్షంగా ధ్రువీకరిస్తూ శనివారం కలెక్టరేట్ కాంపౌండ్‌లో గల గోదావరి సమావేశ మందిరంలో జరిగిన 20 సూత్రాల అమలు సమీక్ష సమావేశానికి జిల్లా అధికా రులు మొత్తం మాస్కులు ధరించి హాజరవ్వ దం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎటువంటి సర్వే నిర్వహించ కుండానే జిల్లాలో ఎక్కడా కూడా కోవిడ్ కేసులు నమోదు కాలేదని డిఎంహెచ్ఓ మాలిని చెప్పడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో జలుబు, దగ్గు, గొంతు నొప్పి తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి జాబితాకై ఎటువంటి ఇంటింటా సర్వే నిర్వహించపోవడం కూడా వైద్య ఆరోగ్య శాఖ పనితీరుకు అద్దం పడుతుందని విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కోవిడ్ పై ఇంటింటా సర్వే నిర్వహించి, ముందస్తు చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాయితీలు

(1వ పేజీ తరువాయి)

సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత త్రైమాసిక కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 386 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 333 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని, మిగతా 53 దరఖాస్తులు వివిధ శాఖల వద్ద పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులు అన్నింటిపైన నిర్దిష్ట గడువులోపు తగిన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్.గణపతి, ఏడీ ఎస్ విజయ్ కుమార్, రవాణా శాఖా అధికారి జివి శివ రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ రమణా రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి రాధ కృష్ణ, ఎల్డీఎమ్ సిఎచ్ఎస్ప్ ప్రసాద్, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ, జిల్లా అగ్నిమాపక, సాంఘిక సంక్షేమ శాఖ ఇతర శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ సిబ్బంది విజయ్ కుమార్, సందీప్, సురేష్ మరియు వివిధ అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిప్పికొట్టండి

(1వ పేజీ తరువాయి)

దక్కుతుందని ఆమె అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో పోలీసులు దమన కాండ సాగిస్తున్నారని పేర్కొన్నారు. దండకారణ్యంలో ఖరీదైన సహజ వనరులను అక్రమంగా తరలించడానికి అడ్డుగా ఉన్న ఆదివాసులను మావోయిస్టుల పేరుతో అమానుషంగా కాల్చివేస్తున్నారని మండిపడ్డారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు, నిర్మాణానికి 5 లక్షలు సహాయం, సూపర్ సిక్స్ పథకాల అమలుకై జూన్ 2న రాష్ట్రవ్యాప్త తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ఆందోళన ను జయప్రదం చేయాలని వనజ పిలుపునిచ్చారు. గత ఎన్నికల ముందు ఇండ్లు నిర్మిస్తాం రేషన్ కార్డుతో పాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, 24 గంటలు త్రాగునీరు అందిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలతో ఓట్లు దండుకొని అధికారంలోకి రాగానే ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెడుతున్నారని ధ్వజమెత్తారు. దశాబ్దాల తరబడి పేదలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం కోసం అధికారులు నేతల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 32 లక్షల మంది ఇంటి స్థలం పొందినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నప్పటికీ కట్టుకోని వారికి ప్రస్తుత ప్రభుత్వంలో స్థలం నిర్మాణ వ్యయాన్ని పెంచి నిర్మాణ దశలో ఉన్న వారికి అదనపు సహాయాన్ని పెంచి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అక్కినేని వనజ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాతిపాక మధు, నగర కార్యదర్శి వి. కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి. లావణ్య, చింతలపూడి సునీల్, పి. త్రిమూర్తులు, జట్ల సంఘం అధికారబాడి అప్పలనాయుడు, నల్ల రామారావు, వెంకటరావు, తాడితోట కార్యదర్శి వానపల్లి సూర్యనారాయణ, టౌన్ కార్యవర్గ సభ్యులు టి. నాగేశ్వరరావు, జట్ల సంఘం నాయకులు సత్యనారాయణ, గురు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో పెన్షన్లు పంపిణీ సక్రమంగా జరిగింది. ఒకరోజు ముందుగానే పెన్షన్లు పంపిణీకి ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు సక్రమంగా వీటిని పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో వాణి అనేక ప్రాంతాలలో పెన్షన్ దారులకు పెన్షన్ అందించారు. సచివాలయ,రెవిన్యూ ఉద్యో గులు పంపిణీలో పాల్గొన్నారు. మండలంలో 7,768 మంది పెన్షన్ దారులు ఉండగా మొదటి రోజు 7,590 మందికి వీటిని పంపిణీ చేశారు. మిగతా పెన్షన్ దారులకు రెండు రోజుల్లో అందిస్తామని అధికారులు తెలిపారు.

చౌక డిపోల పరిశీలన

విశాలాంధ్ర-లింగపాలెం: చౌకడిపోల ద్వారా జరిగే నిత్యవసర సరుకుల పంపిణీని సక్రమంగా నిర్వహిం చేందుకు తహసిల్దార్ ప్రసాద్ చర్యలు తీసు కున్నారు. చౌకడిపోలకు డీలర్లు లేని ఆరు డిపోలలో ఏర్పాట్లపై తహసీల్దార్ స్వయంగా వెళ్లి పరిస్థితులను సమీక్షించారు. ఇన్‌చార్జి డీలర్లకు పలు సూచనలు చేశారు. దుకాణాలకు వచ్చే కార్డుదారుల పట్ల డీలర్లు మర్యాదగా వ్యవహరించి సక్రమంగా నిత్యవసర సరుకులు అందజేయాలని ఆదేశించారు. వినియోగదారులకు ఇబ్బందులు కలుగ కుండా తహసీల్దార్ చర్యలు తీసుకున్నారు. బాదరాల చౌకడిపోను ఈయన తనిఖీ చేశారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

విశాలాంధ్ర-లింగపాలెం: వేసవి శిక్షణ తరగతులలో భాగంగా ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రంథాలయాలలో జరుగుతున్న శిక్షణా తరగతులలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఇండోర్ పోటీ లలో అనేకమంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడలపట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని, క్రీడల వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని శారీరక దారుఢ్యం పెరుగుతుందని తెలిపారు,విద్యార్థులకు క్రమశిక్షణ అలవడు తుందని ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.శిక్షణ తరగతులలో గ్రంథాలయ అధికారులు లతీఫ్, వెంకటరమణ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

విశాలాంధ్ర -కైకలూరు: యోగాతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని రూరల్ సీఐ వి.రవికుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ పోలీసు సిబ్బందితో సామూహిక యోగాసనాల సాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం కాదని, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. నిత్యం ఒత్తిడికి లోనయ్యే పోలీసు సిబ్బందికి యోగా ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రస్తుత పరిస్థితుల్లో యోగాకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ప్రపంచవ్యాప్తంగా దీనిని ఆచరిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ కృష్ణ, ఎస్.ఐ.లు శ్రీనివాస్ వెంకట్ కుమార్, కలిదిండి ఎస్ఐ వెంకటేశ్వరరావు కైకలూరు రూరల్ ఎస్.ఐ. రాంబాబు, మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు, ముదినేపల్లి ఎస్.ఐ. వీరభద్రరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శనివారం తాడేపల్లిగూడెం పట్టణంలోని మిలటరీ కాలనీ, రూరల్ మండలం వెంకట రామన్నగూడెం గ్రామంలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగులు,

వయో వృద్ధుల శాఖ సెక్రటరీ, పశ్చిమగోదావరి జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి, కలెక్టర్ చదలవాడ నాగరాణి, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కలిసి పర్యటించి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ శనివారం ఉదయం నుండి ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రశాంత వాతావరణంలో అర్హులైన వారందరికీ సిబ్బంది పింఛన్ పంపిణీ చేస్తున్నారన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 2,23,675 మంది లబ్ధిదారులకు రూ.96.73 కోట్ల ను 4,600 మంది సిబ్బందితో శనివారం ఉదయం గం.7 నుండి పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో సుమారు మూడువేల మందికి ఈ నెల 12వ తేదీన పెన్షన్ బకాయి లను అందజేయనున్నట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో తాడేపల్లి గూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి ఖతీబ్ కౌసర్ భానో, డి ఆర్‌డిఎ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర -భీమవరం: పేదలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషికి తోడుగా స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించడం అభి నందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. శనివారం

శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెళ్లిరోజు సందర్భంగా దాతల సహకారంతో 22 మందికి స్కాలర్ షిప్, ఒక విద్యార్థికి సైకిల్‌ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభను ప్రతిభావంతులను ప్రోత్సహించా లని, విద్యార్థులను, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ విద్యార్థి కూడా విద్యకు దూరం కాకూడదని, తమ దృష్టికి వస్తే వారి ఉన్నత చదువులకు సహకరిస్తామని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలోని ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులు 22 మందికి (ఒక్కొక్కరికి రూ 3 వేలు చొప్పున) రూ.66 వేలు, ఒక విద్యార్థికి సైకిల్‌ను భీమవరం వన్ టౌన్ సిఐ నాగరాజు సహకారంతో అందించామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, భీమాల శ్రీరామ్మూర్తి, వబిలిశెట్టి రామకృష్ణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, చల్లా రాము, కొప్పినిడి బాబీ, యాసా అనిల్, పోకల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు రైస్ కార్డుల జారీకి ప్రత్యేక ఏర్పాట్లు : జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

విశాలాంధ్ర -ఏలూరు: జిల్లాలో ట్రాన్స్‌జెండర్స్ రైస్ కార్డుల జారీకి జూన్ 4వ తేదీన జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి

చెప్పారు.ఈ కేంద్రంలో ట్రాన్స్‌జెండర్స్ కు రైస్ కార్డులు, ఆధార్ కార్డులు జారీ, ఆధార్ కార్డుల్లో మార్పులు,రైస్ కార్డుల్లో కుటుంబ సభ్యులు మార్పులు,చేర్పులు,ఆధార్ కార్డుల్లో చిరునామా, తదితర మార్పులు చేస్తారని,ట్రాన్స్‌జెండర్స్ ఈ కేంద్రం ద్వారా అందించే సేవలు వినియోగించుకోవాలని జేసీ ధాత్రిరెడ్డి చెప్పారు.

పంచాయతీ కార్మికులకు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: పంచాయతీ కార్మికులకు 010 పద్దు,ట్రెజరీ ద్వారా కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూని యన్- (ఏఐటియుసి) జిల్లా నాయకులు పి.కిషోర్, ఏఐటియుసి జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు డిమాండ్ చేశారు. శనివారం ఏలూరు మండలంలోని పలు గ్రామాల 60 మంది పంచాయతీ కార్మికులు ఏఐటీయూసీ సంఘంలో చేరిన సందర్భంగా చాటపర్రులో పంచాయతీ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పి.కిషోర్, పుప్పాల కన్నబాబు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికు లకు 010 పద్దు,ట్రెజరీ పద్ధతిలో నెల నెల రెగ్యులర్‌గా జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు.పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు కరోనా సమయంలో తమ ప్రాణాలు పణంగా పెట్టి సేవలు

అందించాలని గుర్తు చేశారు. పంచాయతీ కార్మికులకు సకాలంలో యూనిఫారం, సబ్బులు, చెప్పులు,కొబ్బరినూనె,రక్షణ కొరకు చేతి గ్లౌజులు అందించాలని కోరారు. పంచాయతీ కార్మికులందరూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఐక్యంగా తమ సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండలంలోని పలు గ్రామాలు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

పి4 ప్రభుత్వ లక్ష్యం తొలిసారి ఆగిరిపల్లిలో నెరవేర్చిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్న దని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి అన్నారు. శనివారం ఆగిరిపల్లిలో పర్యటించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధ సారధి గ్రామంలో పలు కుటుంబాలను స్వయంగా కలుసుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి దృష్టికి వచ్చిన పలు సమస్యలపై పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తగు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తెలుసుకునేందుకు ఎప్పటి కప్పుడు ఇదొక అవకాశంగా భావిస్తున్నా మన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ,

తల్లికివందనం పథకం కార్యక్రమాలు అమలు కానున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు కృషిచేస్తూ మరోవైపు పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులు తీసుకువచ్చే కార్యక్రమం పెద్దఎత్తున చేస్తున్నారన్నారు. మండలంలో భూ సమస్యల పరిష్కారానికి సబ్ కలెక్టర్ తో కలిసి ప్రత్యేక సమీక్ష ఏర్పాటు చేస్తానన్నారు. మండలంలో భూ సమస్యలు చాలా మంది ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. మంత్రి వెంట పలువురు అధికారులు, కూటమి నాయకులు ఉన్నారు.

ధూమపానం వద్దు - జీవితం ముద్దు

విశాలాంధ్ర - గణపవరం: ప్రపంచ నోటొబాకో దినోత్సవ సందర్భంగా గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పల్లికొండ కిరణ్మయి, డాక్టర్ కమతం ఓంకార్ నాథ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ధూమపానం వద్దు... జీవితమే ముద్దు స్మోకింగ్ నో చెప్పు మంచి ఆరోగ్యానికి ఎస్ చెప్పు పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం మీరు కాలుస్తున్నది సిగరెట్‌ని కాదు మీ జీవితాన్ని, మత్తు పదార్థాలు వద్దు ఆరోగ్యం ముద్దు.. సిగరెట్ వద్దు పౌష్టికాహారం ముద్దుఅంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ధూమపానం వలన వచ్చే వ్యాధుల గురించి డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ గుండె జబ్బులు పక్షవాతం క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్ బాబు, పీహెచ్ఎన్

సిహెచ్ వి సత్యవతి, హెచ్‌వి పద్మజ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు , ఏఎన్ఎం లు, హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు నివారించండి...
ఆరోగ్యాన్ని కాపాడుకోండి

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : ప్రతి ఒక్కరు పొగాకు వాడకాన్ని నివారించి ఆరో గ్యాన్ని కాపాడు కోవాలని ఆరోగ్య శాఖ డీపీఎం ఓ. ధనలక్ష్మి అన్నారు. పొగాకు నివారణ దినోత్సవాన్ని

పురస్కరించుకుని శనివారం భీమవరం మున్సిపాలిటీ ఏరియాలో ఆ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు ధూమపానానికి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, పొగాకు వాడటం మూలంగా క్యాన్సర్, మరియు హృదయ సంబంధించిన వ్యాధులు వస్తాయని ప్రతి ఒక్కరు గుర్తు ఎరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, గోవిందు, పలువురు ఆశ వర్కర్లు ఏఎన్ఎంలు,పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులపై అవగాహన

విశాలాంధ్ర-కాళ్ల : కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ అధ్యక్షతన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సునీల్ మాట్లాడుతూ పొగాకు, నికోటిన్ ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమలపై అవగాహన కల్పిం చారు. పొగాకు,

నికోటిన్ ఉత్పత్తులు ప్రజలు తీసుకోవడం వలన ఊపిరితిత్తుల క్యాన్సర్, టీబీ వచ్చే ప్రమాదం ఉన్నదని,పొగాకు ఉత్పత్తులు తీసు కోవడం వలన బీపీ, ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నదని పొగపీల్చే వారి కన్నా పక్కనున్న వారికి కూడా చాలా ప్రమాదం ఉన్నదని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ డి.సునీత, డాక్టర్ టి. భావన,సిహెచ్ఓ విజయవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో మంత్రి కొలుసు పార్ధసారధి పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర-ఆగిరిపల్లి : ప్రతినెల ఏలూరు జిల్లాలో 2.58 లక్షల మందికి రూ. 113 కోట్లు పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్టు రాష్ట్ర

గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు. శనివారం నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో సచివాలయ సిబ్బంది చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి కొలుసు పార్ధసారథి ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం స్వయంగా కొందరు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా కోట్లాదిరూపాయలతో సామాజిక పెన్షన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. పేదలపట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశు ద్ధికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.మంత్రి వెంట మండల అభివృద్ధి అధికారి,ఇతర ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన కమిషనర్

విశాలాంధ్ర - నరసాపురం: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శనివారం తెల్లవారుజాము నుంచి మున్సిపాలిటీ పరిధిలో పంపిణీ చురుగ్గా సాగిందని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. ఆయన శనివారం స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. శ్రీహరి పేట పొన్నపల్లి, కొండలమ్మ గుడి,ఎన్టీఆర్ కాలనీ, వివర్స్ కాలనీ తదితర వార్డులలో ఇంటింటికి వెళ్లి పెన్షన్ అంద చేశారు. వారి కుటుంబ

పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర ఏ సమస్యలు ఉన్నా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆకుల సాయి, సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో కన్నాపురం రోడ్డులో దుకాణదారులు రహదారిపై ప్రభుత్వ స్థలాలలో ఆక్రమణలు చేసి రహదారిపై పాదచారులు నడవడానికి కూడా వీలు లేని విధంగా ఆర్ అండ్ బి రహదారులను ఆక్రమించుకున్నారని గ్రామానికి చెందిన మల్లవరపు శ్రీనివాస్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో , జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులకు, ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆర్ అండ్ బి, రెవెన్యూ శాఖల అధికారులు పట్టణంలో కొలతలు వేశారు. రోడ్డు వెడల్పు, ప్రభుత్వ స్థలం ఎంతవరకు ఉంది అని, కొలతలు వేసి మార్కింగ్ వేసే క్రమంలో, గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి ఎఫ్ఎంబి ప్రకారం కొలతలు వేయాలని రెవెన్యూ అధికారులను ఆమె కోరారు. పట్టణంలో 2011 వ సంవత్సరంలో ఆర్ అండ్ బి అధికారులు, రెవెన్యూ అధికారులు, కొలతలు వేసి పెట్టిన మార్కింగ్ కు, ఇప్పుడు వేస్తున్న కొలతలకు చాలా తేడాలు ఉన్నాయని, పంచాయతీ వారు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలంటే అనేక ఇబ్బందులు తలెత్తుతాయని, పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనితో అధికారులు సర్వేను తాత్కాలికంగా నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మూడు శాఖల అధికారులు తెలిపారు.

2న ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాల కోసం ఈ నెల 2న మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు పిలుపునిచ్చారు. మండలంలో ఎర్రంపేట గ్రామంలో సీనియర్ నాయకులు నారాయణరావు ఇంటి వద్ద శాఖ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న ఆంజనేయరాజు మాట్లాడుతూ పేద ప్రజలకు ఇళ్ళు,ఇళ్ల స్థలాలు,పోడు భూములు పంపిణీ చేసిన ఘనత సిపిఐకి దక్కుతుందన్నారు. ఎర్రంపేట, రాజవరం,కనకాద్రి పురం, తిమ్మన్న కుంట గ్రామాలలో నివసించే నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పోడు భూముల పంపిణీ కోసం సీపీఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి నిరుపేదలకు ఇచ్చినట్టు తెలిపారు.అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు,ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 2వ తేదీన మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులుతో పాటు, సీపీఐ, బి.కె.యం.యు.శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా చింతలపూడి దుర్గారావు, సహాయ కార్యదర్శిగా గన్నమనేని కాశీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. అంతర్వేది దేవి(62) అనే మహిళ తన కొడుకుని వెంట పెట్టుకుని వెళ్లి పెన్షన్ తీసుకుని ఇంటికి వెళుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో మహిళ రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయమైంది. అదే సమయంలో కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కారు అద్దం తిరిగి పక్కనే ఉన్న పంట బోదెలోకి దూసుకుపోయింది. వెంటనే స్థానికులు స్పందించి కారులో ఉన్న డ్రైవర్ను బయటకు లాగడంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడిన మహిళకు పాలకోడేరు 108 అత్యవసర వాహన సిబ్బంది ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్సకు భీమవరంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు శిక్షార్హం

విశాలాంధ్ర -భీమవరం: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు చేస్తే పోష్-2013 చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మి నారాయణ అన్నారు. ప్యానల్ న్యాయవాదులకు, పారా లీగల్ వాలంటీర్లకు పోష్ చట్టంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి మాట్లాడుతూ మహిళల పరిరక్షణకు ఎన్నో చట్టాలు రూపొందించినప్పటికీ నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల పట్ల గౌరవం చూపని వ్యక్తులు, సంస్థలు అభివృద్ధి చెందవని, ఈ పోష్ చట్టం గురించి ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి ఎంసుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్ బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి పి.హనీషా, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎన్.జ్యోతి కోర్టు తీర్పులను ఉదహరిస్తూ చట్టం పై అవగా హన కల్పించారు. ప్యానల్ న్యాయవాదులు పి.అంబేద్కర్, ఎన్.సుధీర్, కె.జ్యోతి, డి.రవికిరణ్, పారా లీగల్ వాలంటీర్లు వి.శ్రీలక్ష్మి, పి.సూర్యనారాయణ, కె.చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వండి మహాప్రభో!

విశాలాంధ్ర- ఉండి : మండల పరిధిలోని మహాదేవపట్నం గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి మహాప్రభో అంటూ గ్రామ సీపీఐ శాఖ కార్యదర్శి కోన గొల్లయ్య ఆధ్వర్యంలో పూర్తి చేసిన దరఖాస్తులను స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందికి శనివారం అందజేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వా లంటూ పేదలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కోన గొల్లయ్య మాట్లాడుతూ గూడు, నీడ లేక పేదలు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల తలరాత మారటం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత ఒక మాట మాట్లాడటం అధికారం చేపట్టిన ప్రభు త్వానికి పరిపాటిగా మారిందని ఎద్దేవ చేశారు. ఇల్లు ఇళ్ల స్థలాలు లేని పేదలు అద్దెలు చెల్లించుకోలేక నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం కావస్తున్నా ఇంటి స్థలాల ఊసే లేకపోవడం దారుణం అన్నారు. ఒక్క మహాదేవపట్నం గ్రామంలోని ఇళ్ల స్థలాలు లేని అర్హులైన పేదలు వందల సంఖ్యలో ఉన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమం పేదలకు అందని ద్రాక్షగానే మిగులు తుందని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గూడు నీడ లేని పేదలను గుర్తించి తక్షణమే ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు కేత వెంకట సూర్యారావు, వీరవల్లి పొట్టి శ్రీను, వీరవల్లి మాణిక్యాలరావు, గుత్తుల సత్తిపండు, గుత్తుల సూర్యనారాయణ, పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047పై వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర -భీమవరం: శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు "స్వర్ణాంధ్ర-2047" అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మానవతా సంస్థ కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తున్నాయని, ఈ తరగతులకు తల్లిదండ్రులు పిల్లలను శ్రద్ధగా పంపిస్తున్నారని అభినందించారు. విద్యార్థులు సెల్ ఫోన్, టీవీలకు వీలైనంత వరకు దూరంగా ఉండాలని, పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు మననం చేసుకోవా లని సూచించారు. ప్రోగ్రాం కన్వీనర్ అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- 2047 అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, శిక్షణా తరగతుల్లో గెలుపొందిన విజేతలకు జూన్ ఆరవ తేదీన బహుమతులు అందిస్తామని తెలిపారు. అనంతరం బాల బాలిక లకు స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, సిబ్బంది, చదువరులు పాల్గొన్నారు.

యోగా రిజిస్ట్రేషన్‌లు త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో యోగా అభ్యాసన కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం సాయంత్రం వరకు 6,16,530 మంది రిజిస్ట్రేషన్స్ పూర్తిచేసుకున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు.

జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమంలో 8.30 లక్షల మందిని భాగస్వాములను చేయాలనే లక్ష్యానికి శనివారం సాయంత్రం గం.5వరకు 6,16,530 రిజిస్టర్ అయ్యారన్నారు. లక్ష్యానికి అనుగుణంగా రిజిస్ట్రేషన్స్ వేగవంతం చేయాలన్నారు.

కోళ్ల ఫారం కథ మళ్ళీ మొదలు

నూజివీడు సబ్ కలెక్టర్ విచారణ ప్రారంభం

విశాలాంధ్ర -చాట్రాయి : ప్రభుత్వ అటవీ భూమిలో కోళ్ల ఫారం కట్టారని లోకాయుక్తలో చేసిన ఫిర్యాదు పై సంవత్సరాల తరబడి విచారణ కొనసాగుతూనే ఉంది. అధికారులు విచారణ చేయడం పై

అధికారులకు నివేదికలు పంపడం పరిపాటిగా మారింది. శని వారం చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్ ఆధ్వర్యంలో వివాదాస్పద స్థలంలో నిర్మించిన కోళ్ల ఫామ్‌ని మరోసారి పరిశీలించారు. ఫిర్యాదుదారు విచారణకు హాజరు కాలేదు. 645/8 అనే సర్వే నెంబర్ చీపురుగూడెం గ్రామంలో భూముల ప్రభుత్వ లెక్కల్లో ఎప్పుడూ ఎక్కడా లేదని గతంలో అనేక సందర్భాలలో పై అధికారులకు నివేదికలు వెళ్లినట్లు అప్పట్లో ఉన్నతాధికారులే అనేక సందర్భాల్లో చెప్పిన పరిస్థితి వుంది. ఇటీవల కోళ్ల ఫామ్‌ని డిస్మాండిల్ చేయమని పై అధికారుల నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ వాటిని గోప్యంగా బయటకు పొక్కకుండా ఉంచి రెడ్డొచ్చి కథ మొదలు అన్నట్లుగా మరల విచారణ అంటూ తెర మీదకు తీసుకువచ్చారని దానిలో భాగంగానే సబ్ కలెక్టర్ విచారణ ప్రారంభించారని పలువురు అంటున్నారు. ఈ కథ ఏమలుపు తిరుగుతుందో అని పలువురు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

గురుభట్లగూడెంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర -చింతలపూడి: ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉన్న గురుభట్ల గూడెంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఆడపడుచులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలువురు ప్రముఖులకు సన్మానాలు చేశారు. గురుభట్లగూడెం లో పండుగ శోభ సంతరించుకుంది. గత మూడు రోజుల నుండి చింతలపూడి మండలం గురుబట్లగూడెం గ్రామంలో చెక్‌పోస్టు సమీపంలో నూతనంగా నిర్మించిన తల్లి ఆలయంకు ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. చివరి రోజున వేలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలుగు దేశం పార్టీ చింతలపూడి మండల అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, గురుభట్ల గూడెం మాజీ సర్పంచ్ కొరిపల్లి పాపారావు, టీడీపీ నాయకులు గుత్తా నరసింహారావులకు శాలువాలతో చిరు సత్కారం చేశారు. కమిటీ సభ్యులు చింతల వీరస్వామి పాశం సత్యం కంకటి వెంకటేశ్వరరావు ఖమ్మంపాటి పుల్లారావు కంభంపాటి బద్రీనారాయణ చక్రపు కృష్ణయ్య మాదాసు చిన్న శివ కంటే శేషగిరిరావు మాదాసు శ్రీనివాసరావు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చిన్న వెంకన్నకు 10 వెండి చెంబుల బహూకరణ

విశాలాంధ్ర -ద్వారకాతిరుమల : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామికి ఓ దాత వెండి చెంబులను విరాళంగా ఇచ్చారు. కృష్ణాజిల్లా పెనమలూరు గ్రామానికి చెందిన ముసునూరు బాల మన్మధ రావు స్వామివారి శంఖుచక్ర నామాలు డిజైన్ గల 10 వెండి సాదా చెంబులను శనివారం ఆలయ ఈవో ఎన్వివిఎస్ఎన్.మూర్తికి అందజేశారు. సుమారు 2 కిలోల బరువు గల ఈ వెండి చెంబుల విలువ రూ.1.70 లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు మంత్రి దుర్గేష్ పరామర్శ

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు పట్టణంలో సభ్యులను కోల్పోయిన కుటుంబాలను, అనారోగ్య పాలై కోలు కున్న పలువురును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కందుల దుర్గేష్ శనివారం పరా మర్శించారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని ఆరోగ్యంగా ఇంటికి వచ్చిన గంగుల గోపి యాదవ్ ను పలకరించి వారి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. 8వ వార్డ్ లో ఇటీవల గోదావరి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్తి ప్రకాష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఇటువంటి సమ యంలో ధైర్యంతో ముందుకు సాగాలని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ భూపతి ఆది నారాయణ, వార్డ్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మింత్రా ఎండ్ ఆఫ్ రీజనల్ సేల్ ప్రారంభం

విశాలాంధ్ర - రాజమండ్రి : భారతదేశంలోని ప్రముఖ ఫ్యాషన్, సౌందర్యం, జీవనశైలి ఉత్పత్తులకు గమ్యస్థానాలలో ఒకటైన మింత్రా జూన్ 12 వరకు తన ఫ్లాగ్‌షిప్ ఎండ్ ఆఫ్ రీజన్ సేల్ (ఇ ఓ ఆర్ ఎస్) 22వ ఎడిషన్‌ను కొనసాగిస్తోంది. ఫ్యాషన్ ప్రియులు అందరూ ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్న ఈ షాపింగ్ ఈవెంట్ దేశవ్యాప్తంగా ఫ్యాషన్, సౌందర్య ప్రియులను ఆకట్టుకుంటోంది. మెట్రో, భారీ నగరాల నుంచి (టైర్ 1, టైర్ 2), అభివృద్ధి చెందుతున్న నగరాలకు చెందిన కొనుగోలుదా రులు అంతర్జాతీయ, దేశీయ, స్వదేశీ బ్రాండ్‌లతో సహా 10, 000 కన్నా ఎక్కువ బ్రాండ్‌ల నుంచి 4 మిలియన్లకు పైగా స్టైళ్ల లో విస్తృత ఎంపికను అన్వేషించుకునేందుకు మింత్రా అవకాశం కల్పిస్తోంది. ప్రతి ఒక్కరి అభిరుచి, ట్రెండ్‌కు అనుగుణంగా ఈ సీజన్‌లో వారికి కావలసిన అత్యంత స్టైలిష్ ఎంపికలతో, వారి వార్డ్‌రోబ్‌లు, బ్యూటీ షెల్ఫ్‌లను భర్తీ చేసుకోవాలని కోరుకుం టున్న వారికి వారికి ఇది చివరి గమ్యస్థానం.

ఈఏడాది ఎండ్ ఆఫ్ రీజనల్ సేల్ సమయంలో వినియోగ దారులను ఆకట్టుకునే విభాగాల్లో పురుషుల క్యాజువల్ వేర్, పురుషులు, మహిళల ఎథినిక్ వేర్, మహిళల వెస్ట్రన్ వేర్, బ్యూటీ అండ్ పర్సనల్ కేర్, వాచీలు, వేరబుల్స్, ఉపకరణాలు, ప్రయాణ అవసరాలు, స్పోర్ట్స్ ఫుట్‌వేర్, పిల్లల దుస్తులు , వివా హ సేకరణలు ఉన్నాయి. లెవీస్, నైక్, అడిడాస్, హెచ్ అండ్ ఎం, మాంగో, లోరియల్, లాక్మే, లిబాస్, డెకాథ్లాన్, న్యూ బ్యా లెన్స్, క్రోక్స్, యుఎస్ పోలో అసోసియేషన్, ప్యూమా మరియు రేర్ రాబిట్ వంటి అనేక ప్రముఖ బ్రాండ్‌లు అధిక ఆకర్షణను పొందుతాయని భావిస్తున్నారు. బ్రీజీ సిల్హౌట్‌ల నుంచి శక్తివం తమైన స్టేట్‌మెంట్ పీస్‌ల వరకు, ఈ కలెక్షన్లు ప్రతి సందర్భం, మూడ్ అలాగే, వ్యక్తిగత శైలికి అనుగుణంగా ఏదో ఒకటి అందిస్తాయి. థ్రిల్‌కు తోడు, ఎఫ్ డబ్ల్యూ డి , మింత్రా జెన్ జెడ్ ప్రతిపాదన, ఎస్‌జెడ్‌ఎన్, ఫ్రీకిన్స్, బోంకర్స్ కార్నర్, గ్లిట్జెజ్, అనౌక్ రస్టిక్, లులు అండ్ స్కై, కె ఆర్ ఓ పి, బెట్‌జెడర్ వంటి అనేక ఇతర బ్రాండ్‌ల నుంచి 200కే ప్లస్ కన్నా ఎక్కువ ట్రెండ్- ఫస్ట్ శైలులను కలిగి ఉంటుంది.

జీయర్ శాశ్వత అన్నదాన నిధి కమిటీకి విరాళం అందజేత

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం తాళ్లూరు మఠంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధి, జీయర్ శాశ్వత అన్నదాన విధి కమిటీ లో భారీ అన్నదానం శనివారం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమం జగ్గంపేట మండలం మల్లీ సాల గ్రామానికి చెం దిన ఇంజరపు దుర్గ మేరీ దంపతుల కుమారుడు రాజేష్ పుట్టిన రోజు పురస్కరించుకుని నిర్వహించినట్లు కమిటీ పెద్దలు తెలి పారు. అంతేకాకుండా జీయర్ శాశ్వత అన్నదాన విధి కమిటీకి 25 వేల రూపాయల విలువగల సౌండ్ బాక్సులు ఒక యాంం ప్లిఫైర్ రెండు కార్డ్ లెస్ మైకులు బహూకరించినట్లు నిధి కమిటీ తెలిపింది. అన్నదాన కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించినట్లు సుమారు 600 మంది పైబడి భక్తులు చేసినట్లు అన్నదాన నిధి కమిటీ తెలిపింది.

అధికార ముసుగులో అనధికారిక ఇసుక రవాణా

విశాలాంధ్ర - సీతానగరం : అధికారిక ముసుగు లో అనధికారిక ఇసుక రవాణా చేస్తున్న వైనం. మండలంలో కొన్ని నెలలుగా వివిధ గ్రామాల్లో పట్టా భూములు ప్రభుత్వ అనుమతులతో ఇసుక రవాణాతో పాటు ఇసుక నిల్వలను కూడా ఏర్పాటు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ ర్యాంపుల్లో అధిక లోడ్, అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు అని ఆరోప ణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు పై రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సైతం స్పం దించి ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేక పోతే అధికారులు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ కార్యాలయంలో ఇసుక ర్యాంపుల నిర్వాహకులకు సమావేశం ఏర్పాటు చేసి చెప్పారు. వీటి అన్నింటిని నిజం చేస్తూ శనివారం ట్రాన్స్‌ఫర్డ్ ఎస్ ఐ టి అంజనే యులు కాటవరం గ్రామంలో గల ఇసుక ర్యాంపులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బిల్లులు లేకుండా అక్ర మంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసి సీతానగరం పోలీస్ స్టేషన్ కు తరలించారు. వీటిని మైన్స్ అధికారు లకు బదిలీ చేయడం జరుగుతుంది అని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించక పోతే చట్ట ప్రకారం చర్యలు తప్పవు అని హెచ్చరించారు.

యువత పరిశ్రమల స్థాపన వైపు అడుగులు వేయాలి

- ఎమ్మెల్యే గోరంట్ల

విశాలాంధ్ర - కడియం : ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకుని యువత పరిశ్రమల స్థాపన వైపు అడుగులు వేయాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొ న్నారు. కడియం మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో చిన్న మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటు పై అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. కడియం వెలుగు బంటి రామచంద్రరావు కళ్యాణ మండపంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమానికి ఎంపీడీవో కె రమేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ చిన్న మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే సీడ్ ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ వంటి సంస్థల సహకారంతో పరిశ్రమల ఏర్పాటులో శిక్షణ, నిధుల సమీకరణ, సాంకేతిక సహాయం వంటి అంశాల్లో పూర్తి సహకారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడ్ ఏపీ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ మేనేజర్ కిరణ్, విజయ నగరం సెంచురియన్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ అనిల్, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు బోడ పాటి గోపి, వైస్ ఎంపీపీ పంతం గణపతి, నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు, నాయకులు చెల్లు బోయిన శ్రీనివాస్ వెలుగుబంటి నాని, ముద్రగడ జెమ్మి తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు గురవుతున్న వరిపొలాలు

- పట్టించుకోని అధికారులు
- అక్విడెక్టు శుభ్రత పనులు చేపట్టిన రైతులు

విశాలాంధ్ర - కడియం : ఒకపక్క ప్రభుత్వాలు రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని అం టుంటే, కనీసం ముంపు నీరు బయటకు పోయే అక్విడె క్టులను పట్టించుకునే అధికారులే కరువయ్యారని దుళ్ల నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కంటిపూడి శ్రీనివాస్ అన్నారు. కడియం మండలం దుళ్ల శివారు లోని కాలు వ వద్ద అక్విడెక్టు తరచూ పూడుకు పోవడంతో రైతులే నడుం బిగించి ప్రొక్లెయిన్‌తో శనివారం శుభ్రత పనులు చేపట్టారు. ఈ పూడిక తీత కార్యక్రమంలో పాల్గొన్న నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కంటిపూడి శ్రీనివాస్, రైతు లు యన్నమని వెం కటరత్నం నాని, శ్రీరామ చంద్ర మూర్తి, కంటిపూడి వీర వెంకట చౌదరి, శ్రీనివాసులు మాట్లాడుతూ సుమారు వెయ్యి ఎకరాలు ఆయకట్టును ముంపు నుంచి కాపాడుతూ దుళ్ల శివారు మడికి నుంచి వచ్చే కాలువ అడుగు భాగంలో బ్రిటిష్ కాలం నాటి అక్విడెక్టు నిర్మాణం జరిగిందని, అయితే ఈ నిర్మాణం పైన ఉన్న పుంత రోడ్ లో గతంలో కేవ లం ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, సైకిళ్ళు, మోటార్ వాహ నాలు వంటివి మాత్రమే ప్రయాణం సాగించేవని, కానీ ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో నర్సరీ మొక్కల హెవీ లోడ్ తో లారీలు ప్రయాణం సాగిస్తున్నాయని, దీంతో రోడ్ కృంగిపోయి అక్విడెక్టు నిర్మాణం దెబ్బతిని, పూడు కు పోవడం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్, డ్రైనేజీ బోర్డ్ అధికారులకు ఈ అక్విడెక్టు ను పటిష్ట పరచి, పూడిక తీసి రైతుల్ని ఆదుకోవాలని ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా, పట్టించుకునే వారు కరువ య్యారన్నారు. ప్రతి ఏటా రైతులే తమ సొంత ఖర్చులు తో ఈ పనులు చేపట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య పరిష్కారా నికి తగిన చర్యలు తీసుకోవాలని, అధికారులు పట్టించు కోకపోతే రైతులంతా ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

యోగాతో శారీరక దృఢత్వం

విశాలాంధ్ర - కొవ్వూరు : శరీరంలోని రుగ్మతలను తొలగించి శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకో వడానికి యోగా దోహదపడుతుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. యోగాంధ్ర దినోత్స వంలో భాగంగా శనివారం కొవ్వూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుండి విజయ విహార్ సెంటర్ వరకు యోగాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగ ఎంతో ఉపయోగపడుతుందని ప్రతి నిత్యం యోగా చేయడం ద్వారా శరీరంలోని రుగ్మతలు తొలగి సం పూర్ణ ఆరోగ్యవంతులు కాగలరని అన్నారు. జూన్ 21వ తేదీ విశాఖపట్నంలో ఐదు లక్షల మందితో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూ రు మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి, ఆర్డీవో రాణి సుస్మిత, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని, మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్ర కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ వై వి వి ఎస్ కుమార్, యోగ గురువులు అల్లూరి కృష్ణారావు పాల్గొన్నారు.

రత్నకుమారి సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - రాజోలు : రిటైర్డ్ బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి మేడిది రత్న కుమారి సేవలు మరువలేనివని సీనియర్ న్యాయవాది మాకే దేవీ ప్రసాద్ అన్నారు. శనివారం కడలి గ్రామంలో న్యాయవాది యాలంగి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన రత్నకుమారి సంతాప సభకు దేవీ ప్రసాద్ ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. తొలుత రత్న కుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె సూపరెంట్‌గా పనిచేసి సమయంలో బిఎస్ఎన్ఎల్ కష్టమర్లకు ఎన్నో సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్ట ర్ యలంగి పద్దయ్య, రిటైర్డ్ ఎంఇఓ జొన్నలగడ్డ గోపా లకృష్ణ, సంధ్యారాణి, కడలి మాజీ ఎంపీటీసీ తోట సురేష్, ఇంజేటి సువర్ణ రాజు, నాగేంద్ర బొడ్డపల్లి పుల్లయ్య, పినిశెట్టి మల్లిఖార్జునరావు, సుంకర శ్రీను పాల్గొన్నారు.

జిఎస్ఎల్ ఫిజియోథెరపీ విద్యార్థులకు ఉన్నతమైన ర్యాంకులు

విశాలాంధ్ర - రాజానగరం : తమ కళాశా లలో మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు రాష్ట్రంలో ఉన్నతమైన ర్యాంకులు సాధించడం అభినందనీయమని జిఎస్ఎల్ ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.అప్పారావు అన్నారు. ఇం దుకు సంబంధించి పత్రిక ప్రకటన శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎస్ఎల్ ఫిజియోథెరపీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్న వై లిఖిత యూనివర్సిటీ లోని అన్ని ఫిజియోథెరపీ కళాశా లల్లో ఫస్ట్ ర్యాంకు సాధించగా,ఎండివిజె బేగం 7వ ర్యాంకు సాధించారని చెప్పారు. . రాష్ట్రంలోనే ఉత్తమ స్థానంలో నిలిచిన ఈ విద్యార్థులను మిగిలిన విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ఉన్నత ప్రతిభ కనబరచాలని ఆకాం క్షించారు. ఉన్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థు లను పలువురు స్ఫూర్తిగా నిలుస్తారని ఆయన అభినందించారు.

అంకిత భావాలు అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - పెదపూడి : విధి నిర్వహణలో ప్రతి ఒక్కరు అంకితభావాలు అల వరుచుకోవాలని ఇన్చార్జి ఎం పీడీఓ ఎం సత్య నారాయ ణరెడ్డి అన్నారు. శహపురం గ్రామ సచివాలయం కార్య దర్శి ఉమామహేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉమామహేశ్వర రావు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉత్తమ సేవలు అందించి, ప్రజల నుంచి మంచి ఆదరణ అభిమానాలు పొందారన్నారు. ఉమామహేశ్వరరావుకు శాలువ కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమం లో సర్పంచ్ వసుం శాంతకుమారి, సచివాలయం కార్య దర్శులు శ్రీనివాసు చౌదరి, సుంకర వీరస్వామి నాయుడు, భోగరాజు ప్రసన్నాంజనేయులు, జి ఉషారాణి, లక్ష్మీనారా యణ, స్వరూప్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

200 రోజులు పని దినాలు పెంచాలి

విశాలాంధ్ర - కరప : ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాల పెంచి రోజువారి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం రాజశేఖర్ డిమాండ్ చేశారు. కరప గ్రామంలోని ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం 70 వేల కోట్ల ఉపాధి బడ్జెట్ను 50 వేల కోట్ల రూపాయలకు తగ్గించిందని రోజువారి వేతనం 307 రూపాయలకు పెంచితే నేడు పెరిగిన ధరలకు ఏమి రావడం లేదని రాజశేఖర్ తెలిపారు.

వైసీపీ కౌన్సిలర్ల నిరసన

విశాలాంధ్ర - సామర్లకోట : మున్సిపాలిటీలో ప్రతినెల జరగవలసిన కౌన్సిల్ సమావేశం మే నెలకి సంబంధించి సమావేశం ఏర్పాటు చేయకపోవడంతో వైసిపి కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో తమ నిరసనను తెలియ జేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ మాట్లా డుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో సైతం కౌన్సిల్ సమావే శాలు యధావిధిగా జరపగా, ఈనెలలో సమావేశం నిర్వహించడంలో అధికా రులు ఎందుకు తాత్సరం చేస్తున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. పట్ట ణంలో అనేక సమస్యలు అభివృద్ధి పనులకు సంబంధించి సమావేశంలో చర్చ జరగాల్సి ఉండగా వాటిని పక్కదారి పట్టించే విధంగా అధికారులు వ్యవహరి స్తున్నారని ఆరోపించారు. దీనిపై కమిషనర్ స్పందించి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యను కలిసి వినతి పత్రం అందజేశారు.

వేసవి విజ్ఞాన తరగతులు

విశాలాంధ్ర - కాకినాడ : పౌర గ్రంథాలయ శాఖా సం చాలకుల వారి ఆదేశములు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వారి ఉత్తర్వులు ప్రకారం జిల్లా కేంద్ర గ్రంథాలయం కాకినాడ లో 31వ తేదీన వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులచే పుస్తక పఠనం, స్పోకెన్ ఇం గ్లీష్ తరగతులు నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు డీ సూర్య నారా యణ విద్యార్థులకు స్టూడెంట్ గుడ్ హ్యాండ్ రైటింగ్ కోర్స్, పేపర్ క్రాఫ్ట్ ఓరిగామి పై శిక్షణ ఇచ్చారు. జనరల్ నాలెడ్జ్ , పర్సనాలిటీ డెవలప్మెంట్ పై ఉపాధ్యాయులు రమేష్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు 55 మంది పాల్గొన్నారు.

మార్పుతోనే మలేరియా అంతం

విశాలాంధ్ర - అమలాపురం : మన అందరిలో మార్పుతో మలే రియా అంతం సాధ్యం అను నినా దంతో జూన్ 1 నుండి 30వ తేదీ వరకు మలేరియా నివారణ మాసో త్సవాలు సందర్భంగా ఏరియా ఆసుపత్రి అమలాపురం వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైద్యాధికారి, జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో బ్యానర్ ఆవిష్కరణ కార్య క్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ మలే రియా అంతం మనతోనే సాధ్యం అని ప్రజలు అవగాహన పెంచుకోవాలని, తెలియజేశారు. మలేరియా అధికారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాలు వద్ద మలేరియా నివారణ మాసోత్సవాలు జరుగు తాయని అవగాహన సదస్సులు నిర్వ హించాలని, ర్యాలీలు నిర్వహించుట ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం దుర్గారావు దొర, జిల్లా మలేరియా అధికారి ఎన్ వెంకటేశ్వర రావు, కార్యాలయ సిబ్బంది, జిల్లాలోని సబ్ యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సూర్యారావుపేట కాలువ వంతెన పరిశీలన

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని చింతలూరు నుండి సూర్యారావుపేట వెళ్లే ఆర్ అండ్ బి రహదారిలో ఉన్న కాలువ వంతెన ఇటీవల ఓఎన్జిసి కార్యకలాపాలతో శిథిలావస్థకు చేరుకుందని పత్రికలలో ప్రచురితమైన కథనానికి ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే స్పందించారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో ఆ శాఖ డీఈ సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఏఈ వి వెంకటరమణ, సిబ్బంది, స్థానిక నాయకులతో కలిసి వంతెనను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వంతెన ఆధారం దెబ్బతిన్న మాట వాస్తవమే అన్నారు. దీనికి పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అప్పటివరకు భారీ వాహనాలకు అనుమతులు నిషేధంగా ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఉన్నత అధికారులకు వంతెన పరిస్థితి నివేదించి మరమ్మత్తులకు ఎస్టిమేట్లు తయారుచేసి పంపిస్తామన్నారు. అలాగే అనుమతులు వచ్చిన వెంటనే వంతెన మరమ్మత్తు పనులు చేపడతామన్నారు. అప్పటి వరకు గ్రామస్తులు జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. అలాగే ఈ వంతెనపై భారీ వాహనాల రాకపోకలకు తావు ఇవ్వలేమని, అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే ప్రమాదం పొంచి ఉన్న ట్లు తెలిపారు. అలాగే భారీ వాహనాలను నిషేధిస్తూ గడ్డర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి అసిస్టెంట్ ఏడు కొండలు, నాయకులు సాయిబాబా, కాల ప్రసాద్, జయరాజు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని చొప్పెల్ల, పెదపల్ల పిహెచ్సిల ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు రహిత దినోత్సవ అవ గాహన ర్యాలీని శనివారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భం గా వైద్యాధికారులు డాక్టర్ అనంత రామకృష్ణ, డాక్టర్ లక్ష్మీ స్నేహ మాట్లా డుతూ పొగాకు, నికోటిన్ ఉత్పత్తులపై పరిశ్రమ వ్యూహాలను బహిర్గతం చేయడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అలాగే ఆ సంస్థలు తమ హానికరమైన ఉత్పత్తులను ఆకర్షణీయంగా కనిపించేలా చేయడంపై దృష్టి పెట్టడం లక్ష్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ చర్యలు తీసుకుందన్నారు. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికమన్నారు. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభా వాన్ని చూపిస్తుందన్నారు. ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయన్నారు. మెదడులో రక్తప్రసరణకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కుల, సిహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ సిహెచ్. వెంకటేశ్వరరావు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని మూలస్థాన అగ్రహారం 216(ఏ) నెంబర్ గల జాతి రహ దారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు ప్రకారం మూల స్థాన అగ్రహారం గ్రామానికి చెందిన తోలేటి నారాయణ మూర్తి (44) అనే వ్యక్తి గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, శనివారం ఉదయం తన పశువులకు దాన నిమిత్తం సైకిల్ పై జొన్నాడ గ్రామం వెళ్లి అక్కడి నుంచి తిరిగి దానా బస్తాతో తన స్వగ్రామం చేరుకునే తరుణంలో జాతీయ రహదారిపై ఎన్ఎల్ 01 బి 3557 నెంబరు గల ట్రావెల్ బస్సు సైడ్ లగేజీ డిక్కి డోర్ బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారని ఎస్సై తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగానే ఎస్సై అశోక్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించామన్నారు. మృతదేహాన్ని స్థానిక ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవంలో ఎమ్మెల్యే సత్యప్రభ

విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం మండలం, అచ్చంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యులు వరుపుల సత్య ప్రభ రాజా ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మిడివరానికి సీఎం చంద్రబాబు వరాల జల్లు

-ప్రజావేదిక పుణ్యమా అంటూ చెయ్యేరుకు మహర్దశ

విశాలాంధ్ర - కాట్రేనికోన : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ముమ్మిడివరం నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారు. శనివారం చెయ్యేరు గ్రామంలో జరిగిన ప్రజా వేదికలో పాల్గొన్న సీఎంకు స్థానిక శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరగా వెంటనే స్పందించారు. వేదికనుండే జి మూలపొలం వద్ద బ్రిడ్జి, కాట్రేనికోన-ముమ్మిడివరం ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణం, గోగులంక బ్రిడ్జి, కుండలేశ్వరం ఏటిగట్టు ఆధునీకరణలకు నిధులు మంజూరు చేస్తామని సీఎం వెల్లడించారు. అలాగే నియోజవర్గంలో రెండు బీసీ రెసిడెన్షియల్ కాలేజీ వసతి గృహాలు మంజూరు చేస్తామని కూడా సీఎం హామీ ఇచ్చారు. చెయ్యేరు గ్రామంలో ఉన్న 14 ఎకరాల మంచినీటి చెరువును ఆధునికరించి రక్షిత మంచి నీటి పథకం నిర్మించేందుకు వెంటనే అంచనాలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ను వేదికనుండే సీఎం చంద్రబాబు ఆదేశించారు. పి4లో స్థానికంగా ఎంపిక చేసిన 141 బంగారు కుటుంబాలను ఆగస్టు15 నాటికి మార్గదర్శకులు దత్తత తీసుకునేలా చూడాలని, స్థానికంగా మార్గదర్శకులు ముందుకు రాకుంటే తానే పంపిస్తానని సీఎం చంద్రబాబు అన్నారు. స్థానికంగా బంగారు కుటుంబాలు మడికి లక్ష్మి, పి సత్యలకు పక్కా గృహాలు, ఉపాధికి కిరాణా షాపులు మంజూరు చేస్తామన్నారు. వీరికి మార్గ దర్శకులుగా ఆర్థిక సహాయం అందించి వారి పిల్లలను చదివించేందుకు ముం దుకు వచ్చిన ఆక్వా వ్యాపారులు చవటపల్లి నాగేంద్ర, ఎం రామరాజులను సీఎం అభినందించి సత్కరించారు. షుగర్ వ్యాధితో వికలాంగుడైన స్థానికుడు పోలిశెట్టి దుర్గాప్రసాద్కు వికలాంగు పెన్షన్ అందిస్తామని, అతని కుమార్తెకు లక్ష యాభై వేల రూపాయలు ఆర్థిక సాయం అందించి ఉద్యోగం కూడా ఇప్పిస్తానని సీఎం చంద్రబాబు ప్రజా వేదికలో వారికి అభయం ఇచ్చారు.

సకాలంలో ఖరీఫ్ పంటలు వేసుకోవాలి

విశాలాంధ్ర - కరప : రైతులు సకాలంలో ఖరీఫ్ పంటను విత్తుకోవాలని జిల్లా అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ ఎన్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. కరప మండలంలోని పెనుగుదురు గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అపరాల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి జెడి విజయ్ కుమార్ మాట్లాడుతూ జూన్ ఒకటో తారీకు నుండి కాలువలకు నీటిని విడుదల చేయడం జరుగుతుందని, రైతులు జూన్ మాసంలో నారుమడులు వేసుకుని బెంగాల్ ఉడుపులు ఊడ్చుకోవాలని రైతులకు తెలిపారు. రైతులు అక్టోబర్ మాసం నాటికి పంటలు కోసే విధంగా రైతుల సిద్ధం కావాలని తుఫాన్ నుండి పంటలను రక్షించుకోవచ్చుని, కూలీలు కొరత తీరుతుందని విజయ్ కుమార్ తెలిపారు. నానో యూరియా వరి పొలాల్లో వేసేందుకు డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించుకోవాలన్నారు. దాళ్వ పంట మార్చి 15 నాటికి పూర్తయితే మాదవ పంటగా అపరాలు వేసుకోవడం వలన భూమిలో భూసారం పెరిగి పంటలు దిగబడి పెరుగుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ అగ్రికల్చర్ అధికారి కే బాబురావు, ఏమో రాజేష్, బందారు మురళి, నీటి సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి గోవిందరాజులు, గంట నాని బాబు, పబ్బినీడి చక్ర రావు, బందారు గోపాలకృష్ణ, పెంకె మల్లేశ్వరరావు తదితర రైతులు పాల్గొన్నారు.

పది పరీక్షల మూల్యాంకనంలో అవకతవకలతో విద్యార్థులకు నష్టం

విశాలాంధ్ర - రాజోలు : పదో తరగతి పరీక్షలు రాసిన (2025) విద్యార్థులకు పరీక్షా జవాబు పత్రాల మూల్యాంకణంలో అనేక అవకతవకలు జరగడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు దేవ రాజేంద్రప్రసాద్ విద్యాశాఖ తీరును తీవ్రంగా విమర్శించారు. శనివారం మలికిపురంలో ఆయన మాట్లాడుతూ పది పరీక్షలు బాగా వ్రాసినప్పటికి మూల్యాంకణం సరిగా చేయకపోవడంతో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యారని, తల్లిదండ్రులు 1000 రూపాయలు రీ వాల్యూయేషన్ ఫీజు కట్టినప్పటికి రీ వాల్యూయేషన్లో జవాబులు సరిగా ఉన్నవాటికి కూడా మార్కులు వేయకుండా యధాతధంగా తిరిగి మార్కుల లిస్ట్ పంపించడం జరిగింది అన్నారు. దీనిపై అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారికి పిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా III IIలో కూడా ప్రవేశాలకు తగినంత సమయం లేదు. కాబట్టి ప్రవేశాలను జూన్ 10వ తేదీ వరకు పెంచాలని రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మూల్యాంకణంలో తప్పులు చేసి విద్యార్థులకు నష్టం కలిగించిన వారి పై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ

విశాలాంధ్ర - సామర్లకోట : రాష్ట్ర వ్యాప్తంగా ఫించన్ నగదు పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం ఒక రోజు ముందుగానే పండగలా నిర్వహించింది. సచివాలయ ఉద్యోగులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సామర్లకోట పట్టణానికి చెందిన తుమ్మలపల్లి సత్యవతి అనేటువంటి లబ్ధిరాలు కాకినాడ హాస్పిటల్లో ఉండి చికిత్స పొందుతున్న నేపథ్యంలో సామర్లకోట సచివాలయ ఉద్యోగి, టిడిపి నాయకులు నిమ్మకాయల కిరణ్ కుమార్ హాస్పిటల్‌కి వెళ్లి పింఛన్ అందజేశారు.

ధ్వజస్తంభం, కనక దుర్గమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - శంక వరం : కాకినాడ జిల్లా ప్రత్తి పాడు నియోజవర్గం శంఖ వరం మండలం అచ్చంపేట గ్రామంలో ధ్వజస్తంభం, కనకదుర్గమ్మ అమ్మవారి విగ్ర హ ప్రతిష్ట కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్య కిరణ్ బాబి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యు లు కరణం సుబ్రహ్మణ్యం, శంఖవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు గాబు సుభాష్, మండల ఉపాధ్యక్షులు తలపంటి బుజ్జి, పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిమ్మల్ని ఆహ్వానించిన అచ్చంపేట జన సైనికుడు సాయికి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

వెండి బహూకరణ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ రాజరాజేశ్వరి సమేత దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయం నిర్వహణకు పల్లంట్ల గ్రామానికి చెందిన కొయ్యలమూడి హనుమంతరావు (లేటు) భార్య మంగాదేవి శనివారం 10 లక్షల రూపాయలు మరియు రెండు కేజీల వెండి నీ ఆలయ దాతలు మరియు గ్రామ పెద్దలు కొయ్యలమూడి చినబాబు, సుధారాణి దంపతులకు అందించారు. ఈ సందర్భంగా దాత కొయ్యలమూడి మంగాదేవికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈదుపుగంటి శివరాం ప్రసాద్, కొయ్యలమూడి సురేంద్ర నాథ్ చటర్జీ, మొక్కపాటి శ్రీనివాస రావు, కొయ్యలమూడి అప్పారావు పాల్గొన్నారు మరియు రాజరాజేశ్వరి అమ్మవారికి వెండిని మకర తోరణానికి వినియోగిస్తామని, పది లక్షల రూపాయలు ఆలయం పేరు మీద డిపాజిట్ చేసి వడ్డీతో స్వామివారికి అమ్మవారికి ధూపదీప నైవేద్యాలకి వినియోగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ తెలియజేశారు.

హెల్మెట్ వాడకం, సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ టౌన్ : మోటార్ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ గవర్నమెంట్ వారు జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడా లని, మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని, సెల్ ఫోన్లో మాట్లాడుతు డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా పాటిం చాలని, వీవీ యాక్ట్ కొత్త చట్టం ప్రకారం తప్పు చేసిన వాహనదారులకు భారీ జరిమానాలు విధించబడుతాయని తెలియజేశారు. తదుపరి సైబర్ నేరాలలో భాగముగా :1) ఆన్లైన్ మోసాలు, 2) ఫేక్ లోన్స్ మోసాలు, 3) ఆన్లైన్ జాబ్స్,వర్క్స్, 4) డిజిటల్ అరెస్టు, 5) 112/100, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్సై శంకర్ రావు, ఏఎస్సై బోసుబాబు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయుని స్వామి ఆలయంలో అన్నవితరణ - పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర - రాజా నగరం : మండల కేంద్రమైన రాజా నగరంలోని జాతీయ రహదారిని అనుకుని నెల కొల్పిన శ్రీ పంచ ముఖ ఆంజనేయ స్వామి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్న వితరణకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ భక్తిని చాటుకున్నారు. స్థానిక రాజానగరం లోని జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల కూడలి వద్ద గత 21ఏళ్లుగా ప్రతి ఏట హనుమాన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేయడం పరిపాటి. అయితే ప్రస్తుత ఏడాది ఆలయం చెంతనే ఉన్న స్కూల్ నందు పరీక్షలు జరగడంతో పరీక్షలకు వచ్చే విద్యార్థులకు అసౌకర్యం కలగ కుండా ఉండేందుకు అన్నవితరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉల్లి బాబూరావు, కొంతం నర సింహా రావు, గళ్ళ సత్యనారాయణ,బిక్కిన కామ రాజు చౌదరి, ఉల్లి మధు, అబ్బిరెడ్డి లక్ష్మణరావు, ధవళేశ్వరం వాస్తవ్యులు ఈశ్వరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు

విశాలాంధ్ర - రాజానగరం : రాజానగరంలోని కలవచర్ల కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాతేరు గ్రామానికి చెందిన బిక్కిన సత్య భాస్కరరావు(68) అక్కడిక్కడే మృతి చెందగా భార్య పాపా యమ్మకు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి రాజానగ రం ఎస్ఐ ఎస్.ప్రియ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం పెద్దాపురం మండ లం కట్టమూరు గ్రామానికి చెందిన బిక్కిన సత్య భాస్కరరావు తనమనవడు చదువు నిమిత్తం భార్యతో కలిసి రాజమహేంద్రవరం గ్రామీణ పరిధిలోని కాతేరు గ్రామంలో నివసిస్తున్నట్లు చెప్పారు. కట్టమూరు గ్రామంలో జరుగు తున్న ఒక శుభకార్యానికి వెళ్లేందుకు ఇంటి నుండి ద్విచక్ర వాహనం పై బయలు దేరినట్లు చెప్పారు. ఈ నేపధ్యంలో మార్గమధ్యంలో రాజానగరం లోని కలవచర్ల కూడలి వద్దకు వచ్చేసరికి ఏ డిబి రోడ్డు వైపు తిరగడంతో తరు ణంలో అదే మార్గంలో విజయవాడ నుండి విశాఖ పట్నంలోని గాజువాకకి పైపులు లోడుతో వెళ్తున్న లారీ బలంగా ఢీకొనడంతో భాస్కరరావు తలకు బలమైన రక్తపు గాయాలు కావడంతో రక్తం అధికస్రావం కావడంతో అక్కడిక్కడే మృతి చెందగా, పాపాయమ్మను చికిత్స నిమిత్తం రాజమ హేంద్ర వరం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

సుకుమార్‌కు పిల్లి దంపతుల పరామర్శ

విశాలాంధ్ర - కరప : కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతమ్మ రెడ్డి సుధాకర్ కేజీహెచ్‌లో సుకుమార్‌ని పరామర్శించారు. పెనుగుదురు గ్రామం తెలుగుదేశం పార్టీ కార్యకర్త మాజీ తాళ్ళరేవు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వై సుకుమార్ లివర్ వ్యాధితో బాధపడుతూ విశాఖ పట్నం కెజిహెచ్ లో చికిత్స పొందుతున్న సుకుమార్ పరామర్శించారు. సుకుమార్ తొందరగా కోలుకుని జనజీవన స్రవంతిలోకి రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పులపకూర శుభ మహేష్, బుంగ సింహాద్రి, పంపన కన్నారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి

విశాలాంధ్ర - శంకవరం : శంఖవరం మండలం అచ్చంపేట గ్రామంలో సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. శంకవరం మండలం అచ్చంపేట గ్రామంలో ధ్వజస్తంభం, కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో తుని నియోజకవర్గ వైసిపి నాయకులు యనమల కృష్ణుడు, వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం యనమల కృష్ణుడు, గిరిబాబు మాట్లాడుతూ గ్రామాల్లో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రామస్తులను, ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. గ్రామంలో శంకవరం మండలానికి చెందిన వైసిపి నాయకులు గిరిబాబును కలిశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గౌతు స్వామి, గ్రామ సర్పంచ్ బొట్టా చైతన్య, జడ్పిటిసి ఈగల అప్పారావు, నరాల శ్రీను, రామిశెట్టి ఏసుబాబు, సకురు గురాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి చంద్రబాబు పెద్దపీట

విశాలాంధ్ర - కాకినాడ రురల్ : ప్రతి అవ్వా తాతకు ఇంటి దగ్గరకే రూ. 4 వేల పెన్షన్‌ను ముఖ్య మంత్రి చంద్రబాబు పంపించి పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని నియోజక వర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, కో ఆర్డినేటర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి నియోజక వర్గంలోని వలసపాకల, వాకలపూడి, గైగోలు పాడు, పి వెంకటాపురం, రమణయ్య పేట తదితర గ్రామాల్లో టిడిపి శ్రేణులతో కలిసి పింఛను దారులకు పింఛను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని అన్ని విభాగాల సంక్షేమం, అభి వృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమాజంలోని పేద, బలహీన వర్గాల కష్టాలను, వృద్ధులు, బలహీనులు, వితంతువులు, వైక ల్యం ఉన్నవారి కష్టాలను తీర్చడానికి, గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు ఒక ప్రధాన సంక్షేమంగా ఎన్టీఆర్ భరోసా పింఛను కార్యక్రమం నిలిచిందన్నారు. ఈ బృహత్తర లక్ష్యాన్ని సాధించేందుకు, ఆర్థిక పరిస్థి తులు సవాలుగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్ర బాబు ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పింఛను ప్రతినెల లబ్ధిదారులకు అందిస్తున్నారని, జూన్ 1ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వం దన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం ఇస్తోన్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లలో 'స్పౌజ్ కేటగిరీ పింఛన్లు' పేరిట పింఛను పొందుతున్న వ్యక్తి చనిపోతే అతని భార్యకు స్పౌజ్ కేటగిరీ కింద మరుసటి నెల నుంచే పింఛన్ కూటమి ప్రభుత్వం ఇస్తుందని, వృద్ధాప్య, వితంతు, చేనేత, మత్స్యకార, కల్లుగీత, ఒంటరి మహిళ, సంప్రదాయ చెప్పులు కుట్టేవారు, ట్రాన్స్ జెండర్స్,డప్పు కళాకారులకు, కళాకారులకు గతంలో 3వేలు ఇచ్చేవారన్నారు. దానికి అదనంగా వెయ్యి పెంచి 4వేల రూపాయలు అందిస్తున్నామని, దివ్యాంగులకు, కుష్టు వ్యాధిగ్రస్తులకు గతంలో 3వేలు ఇచ్చే వారని దానిని 6వేల కు పెంచి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతపూడి రామకృష్ణ, ఏడుకొండలు, చల్లాజీ, సూరిబాబు, వీరబాబు, పాలిక సతీష్, సీతారామయ్య, బుంగా సింహాద్రి, పంపన కన్నారావు, మహేష్, బొజ్జా సాంబ శివరావు, శివ, సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధులు విడుదల చేయాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర - పోలవరం : కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల విషయంలో అలసత్వం జరుగుతు న్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ ఏలూరు జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ పేర్కొన్నారు. పోలవరంలో శనివారం సిపిఐ మండల కార్యదర్శి జల్లేపల్లి వెంకట నరసింహారావు ఇంట్లో జరుగు శుభకార్యానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెక్కాడితే గానీ డొక్కాడని ఉపాధి కూలీలకు గత 8 వారాలుగా వేత నాలు చెల్లించకపోవడం దారుణమని అన్నారు. వెంటనే నిధులు విడు దల చేసి కూలీల ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశ పెట్టి ఏ ఒక్కటీ అమలు చేయలేని ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని ఎద్దేవా చేశారు. పోల వరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస గ్రామాల్లో సరైన సదు పాయాలు లేవంటూ పదేపదే చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి కూడా స్పందించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర - కాట్రేనికోన : అంబేద్కర్ కోనసీమ జిల్లా, చెయ్యేరులో ఉపాధి హామీ శ్రామికులను రాష్ట్రముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కలుసుకున్నారు. శనివారం జరిగిన ప్రజా వేదిక సందర్భంగా సీఎం ఉపాధి పనులను పరిశీలించారు. సీఎం ఉపాధి కూలీలతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ శ్రామికులు రత్నం, మరియమ్మలకు పెన్షన్లను సీఎం పంపిణీ చేశారు.

'జూన్ 2 మా స్థలం మాకే సొంతం'

కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - పిఠాపురం : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేద ప్రజలు ఇళ్ల స్థలాలు నిమిత్తం పట్టణ నలుమూలల వందలాది ఎకరాలు భూసేకరణ చేసి గుప్పెడు మట్టి నివేసి పిల్ చేయకుండా పేద ప్రజలకు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారని సీపీఐ నాయకులు శాఖ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థలం ఉన్న, లబ్ధిదారులు ఉన్న ఇళ్ల స్థలాలు మంజూరు విషయంలో ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. కోట్లాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన స్థలాల పై ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావాలని జూన్ 2 తేదిన సిపిఐ ఆధ్వర్యంలో అధికారుల ఆదేశాలు కోరుతూ మా స్థలం మాకే సొంతం అనే కార్యక్రమం రాష్ట్ర పిలుపులో భాగంగా నిర్వహించనున్నామని ప్రతి లబ్ధిదారుడు నర్సింగపురంలో సేకరించిన 62 ఎకరాల భూమి వద్దకు రావాలని ఆయన కోరారు.

సీవి రామన్ విద్యార్థికి ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం సర్ సివి రామన్ పాఠశాల పూర్వ విద్యార్థి అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీ పేటకు చెందిన రవణం దుర్గా వెంకట సత్య అవినాష్ బెంగళూరు ఒరా కిల్ సాఫ్ట్వేర్ కంపెనీలో 34 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని సర్ సివి రామన్ స్కూల్ డైరెక్టర్ ఆర్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ ఎన్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పెద్దిరాజు, కరస్పాండెంట్ సత్య కుమార్, హెచ్ఎం జి రాజా అభినందించారు.

యుద్ధ ప్రాతిపదికన ఆర్వోబీ పనులు పూర్తిచేయాలి : మంత్రి దుర్గేష్

విశాలాంధ్ర - నిడదవోలు : ఆర్వోబీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి, ప్రజా రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. శనివారం నిడదవోలు పట్టణంలో పర్యటించిన మంత్రి దుర్గేష్, స్థానిక ప్రజలు, అధికారులతో కలిసి నడుస్తూ ఆర్వోబీ పనులను, అలైన్‌మెంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిడదవోలు పట్టణ వాసులు సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులకు సూచించారు. వర్షపు నీటికి సాధా రణ మట్టి బంకమట్టిగా మారడంతో తరుచూ వాహ నాలు జారుతూ ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయని, దీనికి త్వరితగతిన పరిష్కారం చూపాలని స్థానికులు కోరగా మంత్రి దుర్గేష్ స్పందిస్తూ డ్రైయిన్లలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించే పనులు చేపట్టాలని, కాలువల్లో పడుతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని తద్వారా నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ నిడద వోలు ప్రజ లందరూ ఎంతో కాలంగా ఎదురుచూ స్తున్న ఆర్ఓబీ నిర్మాణ పనులు శరవేగంగా జరిగేందుకు చర్య లు తీసుకుంటామని గడచిన రెండేళ్లుగా స్థానిక వ్యాపారస్తులకు, వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని మంత్రి తెలి పారు. త్వరగా వర్షాలు రావడంతో పనులు నెమ్మ దించాయని ఇకపై వాహన ప్రమాదాలను నివారిం చేందుకు చర్యలు చేపడతామన్నారు. ఆర్వోబీ పనులు నాణ్య తతో చేపట్టాలని అధికారులను మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు.

ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారునికి ఆర్థిక భద్రత..

కూటమి ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛను లబ్ధిదారునికి ఆర్థిక భద్రత అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటో గ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని 4,8 వ వార్డుల్లో ఇంటింటికి వెళ్లిమంత్రి దుర్గేష్ స్వయంగా లబ్ధిదారులకు పింఛ న్లను పంపిణీ చేసి వారి అభిప్రాయాలను అడిగి తెలు సుకున్నారు. జూన్ 1వ ఆదివారం సెలవు దినం కావ డంతో లబ్ధిదారుల ఆర్థిక అవసరతను గుర్తించి ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా పెన్షన్ల పంపిణీ ప్రక్రియ చేపట్టామన్నారు. ప్రజల సామాజిక భద్రత కూటమి ప్రభుత్వ బాధ్యతఅని దుర్గేష్ అన్నారు. సకాలంలో అందిస్తున్న

వివిధ రకాల పెన్షన్లు ప్రజలకు ఎంతో ఉపయోగ కరంగా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం చాలీచాలని పెన్షన్లు అందిస్తే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో అవ్వాతాతలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.15,000 అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రూ.2000 పెన్షన్ ను రూ.3000 చేయడానికి 5 ఏళ్ల సమయం తీసుకుంటే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ ను రూ.4000కు పెంచి ఇంటి వద్దనే అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఖజానాను పూర్తిగా ఖాళీ చేసి వెళ్లిందని అయినప్పటికీ ప్రస్తుతం ఆర్థిక సంక్షోభం ఉన్నా కూడా వాటిని లెక్కచేయకుండా పేద ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమం చేస్తున్నామన్నారు. నాడు కొందరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటింటికి పెన్షన్ అందివ్వరని దుష్ప్రచారం చేశారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ -6 హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పాఠశాలలు తెరిచే నాటికి తల్లికి వందనం, ఆగస్టు 15న ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేస్తామని దుర్గేష్ అన్నారు..

టిడ్కో ఇళ్ల లబ్దిదారుల ఆశలపై నీళ్లు

విశాలాంధ్ర - కొవ్వూరు : సమాజంలో ప్రతి ఒక్కరు తాము సొంత ఇంటిని నిర్మించుకొని సొంత ఇంట్లో గంజితో భోజనం చేసిన ఆ సంతృప్తి వేరని లబ్దిదారులు పేర్కొంటున్నారు అవకాశాన్ని వచ్చిన ప్రతి ప్రభుత్వం ఇంటి నిర్మాణాల పేరుతో మోసం చేస్తూనే వస్తుంది.. వివరాల్లోకి వెళితే కొవ్వూరులో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అపార్ట్మెంట్ల స్థాయిలో ఇండ్లను నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉంది. ఒక కాలనీ మాదిరిగా నిర్మించిన ఈ కాలనీలో కనీస మౌలికసదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో అక్కడ పాముల సంచారం విపరీతంగా పెరిగాయి. నాడు ఇవ్వలేదన్నారు.. మరి మీరు చేసింది ఏమిటో.. 2014 టిడిపి అధికారుల ఉన్నప్పుడు ఇళ్ల నిర్మాణం జరిగింది. దాదాపు నిర్మాణాలు పూర్తయ్య సరికి జగన్ ప్రభుత్వం అధికారులకు వచ్చింది ఆ తర్వాత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అవి మూలన పడ్డాయి. జగన్ ప్రభుత్వం ఉన్న సమయంలో రావడంతో కరోనా రావడంతో పేషెంట్లను ఈ ఇండ్లలో ఉంచి పేషెంట్లకు చికిత్స అందజేశారు కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నాయకులతో ఇళ్లను పరిశీలించి త్వరలోనే అంద జేస్తామని హామీ ఇచ్చారు. అప్పుల పాలైన లబ్దిదారులు ఇక చావేగతే అంటున్న లబ్దిదారులు.. దాదాపు సుమారు 7 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఈ పథకం కొవ్వూరులో నేటికీ అందక పోవడంతో లబ్దిదారులు లబోదిబో అంటున్నారు 7 సంవత్సరాల క్రితం మూడు వాయిదాలలో లక్ష రూపాయలు డీడీలను అందజేశామన్నారు లక్ష రూపాయలకు రెండు రూపాయల వడ్డీ చొప్పున దాదాపు రెండు లక్షల రూపాయలు ఇచ్చి వడ్డీదారులకు జమ చేసి నిలువునా నినలిగిపోయానని పట్టణానికి చెందిన గారపాటి అన్నవరం సత్యనారాయణ విశాలాంధ్ర వద్ద ఆవేదన వ్యక్తం చేశారు ఒక సత్యనారాయణ కాదు.. ఇలాంటి మంది అందరూ వడ్డీలు కట్టలేక ఇంటి అద్దె కట్టలేక సతమతం అవుతున్నారు కూటమి ప్రభుత్వం వచ్చింది కదా.. ఈసారి మాకు న్యాయం జరుగుతుందన్న లబ్దిదారుల ఆశలు అడియాసలు అయ్యాయి ఇస్తే ఇల్లు ఇవ్వండి లేదంటే మా డబ్బులు మాకు వాపసు చేయండి అని లబ్దిదారులు వేడుకుంటున్నారు.

చదువుతోపాటు ఆటపాటలకు ప్రాముఖ్యత కల్పించాలి

విశాలాంధ్ర - కొవ్వూరు : పిల్లలకు విద్యార్థి స్థాయి నుండి చదువుతోపాటు ఆటపాటలకు ప్రాముఖ్యతను కల్పించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. అల్లూరి ఇంద్ర కుమార్ సహాయ సహకారాలతో శ్రీ గౌతమి వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాన్ని శనివారం కొవ్వూరు పట్టణంలోని అల్లూరి వెంకటేశ్వరరావు వాలీబాల్ గ్రౌండ్ నందు నిర్వహించారు. అవంతి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత అల్లూరి ఇంద్ర కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలకు సరైన శిక్షణ కల్పించి క్రీడాకారు లుగా తయారు చేయాలనే సంకల్పం ఎంతో గొప్పదని అన్నారు. గౌతమి వాలీ బాల్ అసోసి యేషన్ ద్వారా కొవ్వూరు నుండి ఎందరో క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రీడలలో పాల్గొనడంతో పాటు జాతీయ స్థాయి క్రీడాకారులుగా కొవ్వూరుకు పేరు ప్రఖ్యాతలను తీసుకు రావాలని కోరారు. అల్లూరి ఇంద్ర కుమార్ మాట్లాడుతూ ఆటలతో పిల్లల శరీర ధృఢత్వాన్ని పెంపొందించి, మానసిక ఉల్లాసాన్ని కలిగి, శక్తితో పాటు చలాకీగా ఉండగలరన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ చైర్ప ర్సన్ భావన రత్నకుమారి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూర్యదేవర చిన్ని, గౌతమి వాలీబాల్ అసో సియే షన్ అధ్యక్షులు పరిమిహారి చరణ్, భారతీయ జనతా పార్టీ నాయకులు బోడపాటి ముత్యాలరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ టీవీ రామారావు, పాల దుగుల రఘు రాం శ్రీ గౌతమి వాలీబాల్ అసోసి యేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ సభ్యులకు అభినందన

విశాలాంధ్ర - అనపర్తి : వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో వివిధ హోదాల్లో నియమితులైన నేతలను నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి అభినందించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ రాష్ట్ర వాలంటీర్ల విభాగం సెక్రె టరీగా చిర్ల వీర్రాఘవ రెడ్డి (అనపర్తి), రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీగా నల్ల మిల్లి విజయమణి కంఠ రెడ్డి (గొల్లల మామిడాడ)ను నియమించినట్టు చెప్పారు. నియామకానికి సహకరించిన పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజాకు మాజీ ఎమ్మెల్యే సత్తి ధన్యవాదాలు తెలిపారు.